


# అవినీతికి తెలివొచ్చింది

-సి.వి.రావ్

భజగోవిందం ఒక కర్మాగారంలో టెక్నికల్ మేనేజర్. ఆ కర్మాగారంలో పనిచేసే కార్మికులకు నాయకుడు కోటిలింగం. కోటిలింగం మాట కార్మికులకు వేదం. ఆ విషయం భజగోవిందానికి బాగా తెలుసు. కోటిలింగాన్ని తన గుప్పెట్లో ఉంచుకుంటే కార్మికుల నుండి తన కెటువంటి సమస్యలు ఉండవనే జీవిత సత్యాన్ని జీర్ణించుకున్నవాడు భజగోవిందం. అందుకోసం కోటిలింగానికి ఎప్పుడైనా తనతో పని పడితే తను "మోర్ దేన్ హేపీ టు హెల్ప్!" అని చెప్పి ఉన్నాడు.

సంవత్సరానికి ఒకసారి జరిగే అప్రెంటిస్ సెలక్షన్ కమిటీకి ఛైర్మన్ భజగోవిందం. ఆ సంవత్సరం కోటిలింగం బావమరిది జంబులింగం కూడా అప్రెంటిస్ షిప్‌కి అప్లయ్ చేశాడు. ఇరవై ఖాళీలకు రెండు వందల దరఖాస్తులొచ్చేయి. ఆ కాంపిటీషన్‌లో బిలో ఏవరేజ్ కాండిడేట్ అయిన తన బావమరిదికి సీటు సంపాదించాలంటే, భజగోవిందం తన కిచ్చిన వరాన్ని ఉపయోగించు కోవడం- అంత ఉత్తమం లేదనుకుని, తన కోరిక భజగోవిందానికి తెలియజేశాడు.

'మనిద్దరం ఒకరికొకరు సహాయపడటం చాలా అవసరం కూడా!' అని లౌక్యంగా ఒక డైలాగ్ కొట్టి, 'సెలెక్టెడ్ కాండిడేట్స్ లిస్ట్‌లో మీ వాడి పేరు తప్పకుండా ఉంటుంది. దానికి నాది పూచీ!' అంటూ కోటిలింగాన్ని గుమ్మందాకా సాగనంపాడు భజగోవిందం.

000

సెలక్షన్ ప్రాసెస్ పూర్తయ్యాక సెలెక్టయిన కాండిడేట్స్ లిస్ట్ నోటీస్ బోర్డులో పెట్టారు. అందులో జంబులింగం పేరు లేదు. భజగోవిందం తనను మోసం చేశాడని అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు కోటిలింగం. బావమరిదికి తను ఉద్యోగం సంపాదిస్తున్నానని అత్తగారింట్లో బాజా కొట్టేసుకోవడం, దాంతో అత్తవారింట్లో (ముఖ్యంగా భార్యామణి దృష్టిలో) తాను హీరో అయిపోవడం గుర్తొచ్చి, తనకు జరిగిన మోసానికి పూనకం వచ్చినవాడిలా ఊగిపోయాడు. ఆవేశంతో భజగోవిందం ఆఫీసువైపు దూసుకుపోయాడు. "లోపల మీటింగు జరుగుతోంది!" అని సెక్రటరీ వారిస్తున్నా వినకుండా భజగోవిందం రూమ్‌లోకి ప్రవేశించాడు. డిప్యూటీలతో వీక్లీ ప్రోగ్రెస్ డిస్కస్ చేస్తున్న భజగోవిందానికి, డోర్‌మీద నాక్

చెయ్యకుండా కోటిలింగం లోపలికి దూసుకువచ్చిన పద్ధతి నచ్చలేదు. అదే మాట కోటిలింగంతో అన్నాడు.

"ఏందిరా, నీ పర్మిషన్ తీసుకువచ్చేది? ఇచ్చిన మాట నిలబెట్టుకోని నువ్వు నా కాలి గోరుతో సమానం!" అంటూ ఏకవచన సంబోధన మొదలుపెట్టాడు కోటిలింగం. డిప్యూటీల ముందు ఒక కార్మికుడు తన పరువు అలా నేలపాలు చేసేస్తుంటే భరించలేని భజగోవిందం మీటింగు అర్థాంతరంగా ముగించేసి తన వాళ్లను బయటకు పంపించేశాడు.

"మంచీ మర్యాదా లేకుండా ఏమిటి నీ వాగుడు? గెట్ ఔట్ ఆఫ్ మై ఆఫీస్!" అని కోటిలింగంతో కోపంగా అన్నాడు. "వెళ్తాను. వెళ్లే ముందు ఒక మాట చెప్పి మరీ వెళ్తాను. నువ్వు చేసిన మోసానికి నీచేత మూడు చెరువుల నీళ్లు తాగించకపోతే నా పేరు కోటిలింగమే కాదు!" అని నోటీసు బోర్డు నుండి పీకి తెచ్చిన లిస్ట్‌ను భజగోవిందం మీదకు విసిరేసి పోయాడు కోటిలింగం.

'కల్లు తాగిన కోతిలా కోటిలింగం ఎందుకిలా చిందులు తొక్కుతున్నాడు?' అనుకుంటూ ఆ లిస్ట్ తీసి చూశాడు భజగోవిందం. అందులో జంబులింగం పేరు లేదు. కోటిలింగం కోపానికి కారణం అర్థమైంది.

"జంబులింగాన్ని తను స్వయంగా సెలెక్ట్ చేశాడు. మరి లిస్ట్‌లో అతని పేరు లేదేమిటి?" భజగోవిందానికి అంతా అయోమయంగా ఉంది.

హెచ్ఆర్ మేనేజర్ శఠగోపానికి ఫోన్ చేసి తను సెలెక్ట్ చేసిన కాండిడేట్స్‌ను ఏమైనా మార్చారేమోనని అడిగాడు. "నో! నో!" అన్నాడు శఠగోపం. పిఏని పిలిచి సెలక్షన్ ప్రాసెస్‌కు సంబంధించిన ఫైలు తెమ్మన్నాడు.

ఫ్యాన్‌తో కాఫీ పంపించమని పిఏని ఆజ్ఞాపించాడు. ఫైల్ నుండి తను సొంతంగా వ్రాసిన ఫైనల్ లిస్ట్‌ను బయటకు తీసి కోటిలింగం తెచ్చిన లిస్ట్‌తో పోల్చి చూశాడు. మిగిలిన పేర్లన్నీ సరిపోయాయి. ఒక్క జంబులింగం పేరు తప్ప. తన లిస్ట్‌లో జంబులింగం పేరున్నచోట నోటీస్ బోర్డు నుండి తెచ్చిన లిస్ట్‌లో దయానంద్ అనే పేరుంది.

ఎక్కడో ఏదో అవకతవక జరిగిందని గుర్తించాడు. దయానంద్ ఫైల్ తెప్పించి స్టడీ చేశాడు. అతని బంధువులెవరైనా తమ కంపెనీలో పని చేస్తున్నారేమోనని కూపీ తీశాడు. చివరికి ఎలాగైతేనేం, పేర్లు మార్చినదెవరో కనుక్కున్నాడు.

'నీరు పల్లమెరుగు' అన్నట్లు వ్యవస్థ అనే పిరమిడ్‌లో అవినీతి ఎప్పుడూ శిఖరం నుండి భూతలానికి వ్యాపిస్తుంది. ఆ వ్యవస్థ ఒక కార్యాలయం కావచ్చు లేదా దేశంలో రాజకీయాలు కావచ్చు. 'యథారాజా తథా ప్రజ' అనే సూక్తి కూడా ఈ విషయంలో వర్తిస్తుంది. వ్యక్తులు తమ స్వార్థంకోసం ఎలా అవినీతికి పాల్పడతారో తెలియచెప్పే ఇతివృత్తమే ఈ కథ.



పేర్లు మార్చినదెవరనుకుంటున్నారు?

హెచ్ఆర్ మేనేజర్ శఠగోపమా?

కాదు.

మరో యూనియన్ నాయకుడా?

కాదు!

ఎవరైనా రాజకీయనాయకుడా?

కాదు.

టాప్ మేనేజ్‌మెంట్‌లో ఎవరైనానా?

కాదు.

మరెవరు?

హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసే సెక్రటరీ మంథర! దయానంద్ ఆమెకు మరిది. అతను కూడా అప్రెంటిస్ షిప్‌కి అప్లయ్ చేశాడు. తన మరిదికి ఒక అప్రెంటిస్ షిప్ సంపాదించాలంటే తను ఫైనల్ లిస్ట్ టైప్ చేసేటప్పుడు సెలెక్టయిన కాండిడేట్స్‌లో ఒకరి పేరు తన మరిది పేరుతో తారుమారు చేస్తే సరిపోతుందని తలచింది కానీ తన ఖర్మకాలి ఆ పేరు కోటిలింగం బావమరిది జంబులింగానిది అయి కూర్చుంటుందని ఆమె కలలో కూడా ఊహించలేదు.

ఆమె మార్చిన పేరు మరెవరిదైనా అయి ఉంటే ఆ విషయం ఎవరికీ తెలిసి ఉండేది కాదు. కానీ ఆమె తల రాతను ఎవరు తప్పించగలరు?

మేనేజ్‌మెంట్ దృష్టిలో ఆమె చేసింది క్షమించరాని నేరం కాబట్టి ఆమెను ఉద్యోగంలోంచి తీసేశారు. జంబులింగం పేరు మళ్లీ లిస్ట్‌లోకి వచ్చింది. కోటిలింగం సంతోషించాడు. భజగోవిందం 'హమ్మయ్య' అనుకున్నాడు.

అవినీతిమయమయిన సమాజంలో తప్పులు చేస్తే శిక్షలు నేలమీద ఉన్నవాళ్లకే గానీ, పైనున్న వాళ్లు మాత్రం అక్రమమార్గంలో అభివృద్ధి (అవినీతితో కూడిన అభివృద్ధి) సాధిస్తూనే ఉంటారు. మన ఈ అవినీతి కథను ఇంతటితో ఆపేద్దామంటారా?

వద్దు! ఈ పేజీలో మరి కొంత స్థలం ఉంది కాబట్టి ఆ స్థలాన్ని కూడా అవినీతితో నింపేద్దాం.

ఈసారి హెచ్ఆర్ మేనేజర్ శఠగోపం వంతు. ఆయనేం చేస్తున్నాడంటారా? మిగిలినవాళ్లు కంపెనీ లోపల అక్రమాలు చేస్తుంటే ఈయన కంపెనీలో తనకు తెలిసిన విషయాల్ని బయట అతితెలివిగా అమ్ముకుంటూన్నాడు.

సెలెక్టయిన కాండిడేట్స్ వివరాలు ప్రకటించే ముందు వాళ్ల అడ్రస్సులన్నీ నోట్ చేసుకుని సాయంత్రం ఆఫీసు మూసేసిన తరువాత ఒక్కొక్కళ్ల ఇంటికి వెళ్లి "మీ అబ్బాయి/అమ్మాయికి అప్రెంటిస్‌షిప్ గారంటీగా ఇప్పిస్తాను, ఓ యాభైవేలిస్తారా?" అని బేరం పెట్టాడు. ఎంక్వయిరీకొచ్చిన పోలీస్ ఆఫీసర్ బాడ్జ్ చూపించినట్లు మన హెచ్ఆర్ మేనేజర్ తన ఐడెంటిటీ కార్డు చూపిస్తుంటే వాళ్లు మాత్రం ఆశతో ఆనందపడిపోరూ? అలాగే అవి తలో యాభైవేలూ సమర్పించుకున్నారు.

ఉద్యోగం సంపాదించటం మహాకష్టం అయిన ఈ రోజుల్లో స్వయంగా లక్ష్మీదేవిలా (మేల్ కదా, కుబేరుడిలా అందామా!) హెచ్ఆర్ మేనేజర్ ఇంటికొచ్చి గ్యారంటీగా పోస్టింగ్ ఇప్పిస్తానంటే కాదని ఎలా అనగలరు చెప్పండి. యాభైవేలంటే ఇవ్వాలి మరి. ఈ రోజుల్లో లంచం లేకుండా పనులు జరగవు కదా! "విన్ విన్ సిట్యుయేషన్" అన్న మాట!

అదండీ కథ! ఒక్కొక్కరి నుండీ యాభై వేల చొప్పున మొత్తం ఇరవై కాండిడేట్స్ నుండి పది లక్షల రూపాయలు ఎంత ఈజీగా సంపాదించేశాడో చూశారా? అవినీతికి తెలివి లేదంటారా? మీరే చెప్పండి!

గమనిక: మీలో మేథమేటికల్‌గా ఆలోచించేవారు 'మొత్తం ఇరవై ఎలా అవుతారు? భజగోవిందాన్ని తీసేస్తే పందొమ్మిదే కదా!' అంటారేమో? మన మేనేజర్ ఒకరిద్దరిని వెయిటింగ్ లిస్ట్‌లో పెట్టాడంటారా? చెప్పండి! ■